ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 133 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం18 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# జల్జీవన్ మిషన్లో జగన్ ప్రభుత్వం

## రూ.4 వేలకోట్లు దుర్వినియోగం చేసింది :పవన్ కల్యాణ్

జలేవన్ మిషన్ లో ప్రభుత్వం రూ.4వేల కోట్లు దుర్వినియోగం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు.




విజయవాడ, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): జలేవన్ మిషన్లో గత ప్రభుత్వం రూ.4వేల కోట్లు దుర్వినియోగం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. నీటిని ఎక్కడి నుంచి తెచ్చుకుంటామనేది గుర్తించక ముందే పైపులు వేశారన్నారు. విజయవాడలో జగ్జీవన్ మిషన్ అమలుపై గ్రామీణ నీటి సరఫరా.. పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వర్క్షాప్లో ఆయన మాట్లాడారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.70వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు పవన్ తెలిపారు. ఈ మేరకు కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ను కోరామన్నారు. పూర్తి వివరాలతో రావాలని ఆయన సూచించినట్లు వివరించారు. “జనవరి నెలాఖరుకు డీపీఆర్ తీసుకొని జలశక్తి మంత్రికి ప్రతిపాదన పంపిస్తాం. జల్జీవన్ మిషనన్ను మరింత బలోపేతం చేస్తాం. అనేకమంది అనుభవిస్తున్న నీటి సమస్య పరిష్కారాన్ని తొలి ప్రాధాన్యంగా తీసుకోవాలి. రోజుకు మనిషికి సగటున 55 లీటర్ల పరిశు భ్రమైన నీటిని ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. నిరంతరం ప్రతిఒక్కరికీ నీటి సరఫరా ఉండాలనే ఆకాంక్షతో జలీవన్ మిషన్ ప్రారంభమైంది” అని పవన్ అన్నారు.

# ఉత్తర కొరియాలో

## భారత దౌత్య కార్యాలయ పునరుద్ధరణ

ఉత్తర కొరియాతో భారత్ సంబంధాలు బలోపేతం చేసుకొనే దిశగా అడుగులు వేస్తోంది.

భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీని వేగవంతం చేసింది. దీనిలో భాగంగా తాజాగా ఉత్తర కొరియాలో దౌత్య కార్యాలయాన్ని ఎటువంటి హడావుడి లేకుండా సైలెంట్గా పునరుద్ధరించింది. ఇప్పటికే అక్కడ కొంతమంది సిబ్బందితో కూడిన బృందాన్ని కూడా ప్యాంగ్యాంగ్కు పంపించింది. వీరిలో అత్యున్నతశ్రేణి సాంకేతిక సిబ్బంది కూడా ఉన్నారు.




సాధారణంగా ప్రతి దేశ కార్యాలయంపై నిఘా వేస్తుందనే పేరు ఉత్తరకొరియాకు ఉండటంతో.. భారత్ కొన్ని జాగ్రత్తలు తీసుకొంది. తొలుత మన బృందం అక్కడికి చేరుకొని దాదాపు మూడున్నరేళ్లుగా ఖాళీగా ఉన్న కార్యాలయాన్ని తనిఖీ చేస్తుంది. నిఘా పరికరాలు ఏమైనా అమర్చారేమో పూర్తిగా గమనిస్తుంది. దీనికితోడు ఉత్తర కొరియాలో బ్యూరోక్రసిలో జాప్యం జరగడంతో మన ప్రధాన దౌత్యవేత్త, మరికొందరు కీలక సిబ్బంది అక్కడికి వెళ్లేందుకు మరికొన్ని నెలల సమయం పట్టొచ్చు.వాస్తవానికి భారత్ 2021 జులైలో ఉత్తర కొరియాలో దౌత్య కార్యాలయాన్ని మూసేసింది. అప్పటివరకు అక్కడ దౌత్యవేత్తగా పనిచేసిన అతల్ మల్హొరిని మాస్కో మీదుగా భారత్కు రప్పించింది. కానీ, అక్కడ ఎంబసీ మూసేసినట్లు అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. కానీ నాడు విలేకర్లు దీనిపై ప్రశ్నించగా.. కొవిడ్-19 కారణంగా ఆ చర్య తీసుకొన్నట్లు వెల్లడించింది. ఆ తర్వాత అక్కడ పనిచేసిన అతుల్ మల్హొరికి మంగోలియాలో పోస్టింగ్ ఇచ్చింది. కానీ హఠాత్తుగా ఈనెల మొదట్లో అక్కడ కార్యాలయాన్ని ప్రారంభించి సాంకేతిక సిబ్బందిని పంపించింది.ఉక్రెయిన్ యుద్ధం, ఇతర కారణాలతో గతంలో కంటే ఇప్పుడు ఉత్తర కొరియా ప్రాముఖ్యం పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా రష్యా, చైనా, ఇరాన్ వంటి దేశాలతో అది సంబంధాలను బలోపేతం చేసుకొంటూ వస్తోంది. మరోవైపు ఆ దేశం సైనిక శక్తి, అణుసామర్థ్యాలను నిలకడగా వృద్ధి చేసుకొంటూ వెళుతోంది. హైపర్సోనిక్ సహా వివిధ రకాల క్షిపణులను అభివృద్ధి చేసింది. ఇలాంటి సమయంలో భారత్ ఆ దేశానికి దూరంగా ఉంటే పాక్ వంటి దేశాలు దానిని వాడుకొనే అవకాశం ఉంది. ఈనేపథ్యంలోనే భారత్ అక్కడ దౌత్య కార్యాలయాన్ని ప్రారంభించి ఉండొచ్చని భావిస్తున్నారు.

# తెదేపా అధికారిక యూట్యూబ్ ఛానల్ హ్యాక్

తెదేపా అధికారిక యూట్యూబ్ ఛానల్ హ్యాకింగ్కు గురైంది.

బుధవారం ఉదయం నుంచి ఛానల్లో అంతరాయం ఏర్పడింది.



అమరావతి, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): తెదేపా అధికారిక యూట్యూబ్ ఛానల్ హ్యాకింగ్కు గురైంది. బుధవారం ఉదయం నుంచి ఛానల్లో అంతరాయం ఏర్పడింది. ఆన్ చేస్తే స్ట్రక్ అయినట్లు వస్తోందని నేతలు తెలిపారు. హ్యాక్ చేసిన వారిని గుర్తించేందుకు తెదేపా టెక్నికల్ వింగ్ రంగంలోకి దిగింది. మరోవైపు పార్టీ వర్గాలు దీనిపై యూట్యూబ్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశాయి. ఛానల్ పునరుద్ధరణకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# బంగాళాఖాతంలోకి 'ధరణి' పోర్టల్ : మంత్రి పొంగులేటి

బేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్ను రద్దు చేస్తున్నామని తెలంగాణ



హైదరాబాద్, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): బేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్ను రద్దు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు."ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్రవు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్సైట్లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం. 18 రాష్ట్రాల్లో ఆర్ ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం" అని పొంగులేటి తెలిపారు.

# అంబేడ్కర్ను సంపూర్ణంగా గౌరవిస్తోంది మేమే: ప్రధాని

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ను కేంద్ర మంత్రి అమిత్ షా అవమానించారంటూ

ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై ప్రధాని మోదీ స్పందించారు.



దిల్లీ, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. అంబేడ్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు.'కొన్నేళ్ల పాటు కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, ముఖ్యంగా అంబేడ్కర్ను అవమానించిన తీరునుఇప్పుడు చెప్పే అబద్ధాలతో వారు దాచలేరు. అలా అనుకుంటే వారు పెద్ద పొరబాటు చేసినట్లే.ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలనుదేశ ప్రజలంతా చూశారు. మనం ఇలా ఉండటానికి అంబేడ్కరే కారణం. గత దశాబ్దకాలంగా ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రధాన కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ ఉపయోగపడ్డాయి' అని మోదీ పేర్కొన్నారు.

# టీచర్ల బాత్రూంలో స్పై కెమెరా ..స్కూల్ డైరెక్టర్ నిర్వాకం

బాత్రూంలో రహస్య కెమెరాలు అమర్చిన పాఠశాల డైరెక్టర్ ను పోలీసులు అరెస్టు చేశారు.



డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): ఉత్తరప్రదేశ్లోని ఓ పాఠశాల డైరెక్టర్ వికృత చేష్టలకు పాల్పడ్డాడు. టీచర్లు వినియోగించే బాత్రూంలో స్పై కెమెరాను ఉంచి.. తన కంప్యూటర్, మొబైల్ ఫోన్లో మానిటరింగ్ చేసేవాడు. ఈ విషయం కాస్త వెలుగులోకి రావడంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..నవనీష్ సహాయ్ అనే వ్యక్తి నొయిడా సెక్టార్ 70లోని ప్లే స్కూల్ డైరెక్టర్గా వ్యవహరిస్తున్నారు. ఈనెల 10న ఓ ఉపాధ్యాయురాలు బాత్రూంలోని బల్బ్ హోల్డర్లో కెమెరా ఉన్న విషయాన్ని గమనించారు. ఈవిషయాన్ని నవనీష్ తో పాటు స్కూల్ కోఆర్డినేటర్ పరుల్ దృష్టికి తీసుకెళ్లగా వారు దీన్ని ఖండించారు. ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఉపాధ్యాయ సిబ్బంది ఆరోపించారు. ఈ క్రమంలోనే ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా.. స్కూల్ డైరెక్టరే ఈ అకృత్యానికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో ఆయన్ను అరెస్టు చేశారు. రూ.22 వేలకు ఆ కెమెరాను ఆన్లైన్లో కొన్నట్లు నిందితుడు అంగీకరించారు.మరోవైపు గతంలోను పాఠశాల బాత్రూంలో స్పై కెమెరాను కనుగొన్నామని టీచర్లు తెలిపారు. దాన్ని స్కూల్ కోఆర్డినేటర్ కు అందజేయగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దీనిపై విచారణ కొనసాగుతున్నందున పాఠశాల కార్యకలాపాలు నిలిపివేసినట్లు పోలీసులు తెలిపారు.

# నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం .. స్పందించిన మంత్రి ఆనం

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలంపై

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు.



నెల్లూరు, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడికి జికా వైరస్ సోకినట్లు ప్రచారం జరిగింది. మంత్రి ఆదేశాలతో జికా వైరస్ అనుమానాలపై జిల్లా యంత్రాంగం స్పందించింది."అనారోగ్యానికి గురైన బాలుడికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. కార్పొరేట్ వైద్యం కోసం చెన్నై తరలించాం. వ్యాధి నిర్ధరణ కోసం బాలుడి బ్లడ్ శాంపిల్స్ను అధికారులు పుణే ల్యాబ్కు పంపించారు. జీజీహెచ్ వైద్యులతో పాటు వెంకటాపురం గ్రామానికి ప్రత్యేక వైద్య బృందాలు వెళ్లాయి. బాలుడి కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్థులకు వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు" అని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

# నెక్లెస్ రోడ్డు నుంచి రాజ్భవన్ కు కాంగ్రెస్ భారీ ర్యాలీ

మణిపూర్ అల్లర్లు, గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం

వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్భవన్' చేపట్టారు..



హైదరాబాద్, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): మణిపూర్ అల్లర్లు, గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్భవన్' చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్రెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# అదానీ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా: సీఎం రేవంత్ రెడ్డి

## భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.




హైదరాబాద్, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయని తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టు పెట్టారని ఆక్షేపించారు. మణిపూర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్భవన్' చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్భవన్ సమీపంలో సీఎం బైఠాయించిన నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు."అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్ బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశం పై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం.అరెస్టు నుంచి తప్పించుకోవడానికి భాజపాకు భారాస లొంగిపోయింది. అందుకే అదానీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. భారాస.. ప్రజల వైపా? అదానీ-ప్రధాని వైపా? అనేది తేల్చి చెప్పాలి. మోదీ-కేసీఆర్ వేర్వేరు కాదు.. ఇద్దరూ నాణేనికి బొమ్మాబొరుసు. భారాసకు చిత్తశుద్ధి ఉంటే అదానీ అవినీతిపై జేపీసీకి డిమాండ్ చేయాలి. ఆ పార్టీ కోరితే శాసనసభలో చర్చకు అనుమతిస్తాం. అదానీ అవినీతిపై జేపీసీ కోసం సభలో ఏకగ్రీవ తీర్మానం చేద్దాం. ప్రధాని అండగా నిలబడినా.. ప్రజాకోర్టులో అదానీని శిక్షించే వరకు పోరాడుతాం" అని రేవంత్రెడ్డి అన్నారు.

# రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ను ప్రజలు గమనిస్తున్నారు:హరీశ్ రావు

## ధర్నాల పేరుతో రోడ్లపై సర్కస్ ఫీట్లు చేస్తున్న సీఎంరేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ ను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు.



హైదరాబాద్, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): ధర్నాల పేరుతో రోడ్లపై సర్కస్ ఫీట్లు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డిడైవర్షన్ పాలిటిక్స్ను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అదానీ.. ప్రపంచం ముందు భారతదేశం పరువు తీశారని రేవంత్రెడ్డి అంటున్నారు.. అదానీతో చేతులు కలిపి సీఎం రేవంత్రెడ్డి తెలంగాణ పరువు తీయలేదా.. అని విమర్శించారు."తెలంగాణలో వివిధ సంస్థల ఏర్పాటు కోసం అదానీతో సీఎం రేవంత్ రెడ్డి రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నారు. రూ.100 కోట్లు ఎలా వాపస్ ఇచ్చావో.. ఈ రూ.12,400 కోట్ల ఒప్పందాలు కూడా రద్దు చేసుకుని నిజాయతీ నిరూపించుకోవాలి. బయట కుస్తీ.. లోపల దోస్తీ అన్నట్టుంది రేవంత్రెడ్డి వ్యవహారం. రామన్నపేటలో డ్రైపోర్టుకు అనుమతిస్తే.. అక్కడ సిమెంట్ ఫ్యాక్టరీకి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతిచ్చింది. దాదాపు 12 గ్రామాల ప్రజలు సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల కాలుష్యమవుతుందని ఆందోళన చెందుతున్నారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం పోలీసులను పెట్టి ఆందోళనకారులను అణచివేస్తున్నారు. పోలీసు పహారా మధ్య పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. సీఎం రేవంత్రెడ్డి, అదానీ సంబంధాలపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని భారాస డిమాండ్ చేస్తోంది" అని హరీశ్రావు అన్నారు.

# తెలంగాణ టెట్ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో టెట్ షెడ్యూల్ను పాఠశాల విద్య డైరెక్టర్ విడుదల చేశారు. సబ్జెక్టు వారీగా టెట్ షెడ్యూల్ను విడుదల చేశారు. జనవరి 2 నుంచి 20 వరకు టెట్ నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం. రెండు షెడ్యూళ్లుగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.



# 'మూసీ'పై అబద్ధాలు ఎందుకు ..ఎవరి లాభం కోసం :ఎమ్మెల్సీ కవిత

## భారాస సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సత్యవతి రాథోడ్ ఆరోపించారు.




హైదరాబాద్, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): భారాస సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తప్పుడు సమాధానాలు ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సత్యవతి రాథోడ్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో మంత్రి శ్రీధర్ బాబు సభను తప్పుదోవ పట్టించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కవిత మాట్లాడారు."మూసీ ప్రాజెక్ట్ కోసం ప్రపంచ బ్యాంకు రుణం అడగలేదని శ్రీధర్ బాబు చెబుతున్నారు. సెప్టెంబర్లో రుణం అడిగినట్లు సాక్ష్యాధారాలు బయట పెడుతున్నాం. డీపీఆర్ లేదని అసెంబ్లీలో చెబుతున్నారు. ప్రపంచబ్యాంకుకు సెప్టెంబర్ 19న ఇచ్చిన నివేదికలో డీపీఆర్ ఉందని పేర్కొన్నారు. అబద్ధాలు ఎందుకు? ఎవరి లాభంకోసం ఇదంతా చేస్తున్నారు? ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. భారాస అధికారంలో ఉండగా ప్రపంచ బ్యాంకును తెలంగాణలో అడుగు పెట్టనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్కార్పెట్ వేస్తోంది. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రూ.14వేల కోట్ల సాయం అడిగారు. మూసీ ప్రాజెక్టుపై అబద్ధాలు చెబుతున్న ఈ ప్రభుత్వాన్ని వదిలి పెట్టే ప్రసక్తే లేదు" అని కవిత అన్నారు.

# రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

## ప్రముఖ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది.



గుంటూరు, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): ప్రముఖ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. 'దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. పెనుగొండ లక్ష్మీనారాయణ గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించి, 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు.దేశ వ్యాప్తంగా 21 భాషలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను బుధవారం సాహిత్య అకాడమీ ప్రకటించింది. వీటిలో ఎనిమిది కవితలు, మూడు నవలలు, రెండు లఘు కథలు, మూడు వ్యాస సంపుటిలు, మూడు సాహిత్య విమర్శకు సంబంధించిన పుస్తకాలు ఉండగా.. నాటక, పరిశోధన అంశాలకు సంబంధించి ఒక్కో పుస్తకం ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికయ్యాయి. బెంగాలీ, డోగ్రి, ఉర్దూ భాషలకు తర్వాతి దశలో అవార్డులు ప్రకటించనున్నారు.మొత్తం 21 భారతీయ భాషల్లో సాహిత్య రంగంలో సుప్రసిద్ధమైన వ్యక్తులు జ్యూరీ మెంబర్లుగా వ్యవహరించి పలు పుస్తకాలను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు సిఫారసు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన బుధవారం సమావేశమైన సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఈ పురస్కారానికి ఎంపికైన పుస్తకాల పేర్లను ప్రకటించింది. విజేతలకు వచ్చే ఏడాది మార్చి 8న దిల్లీలో పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డు కింద రూ. లక్ష నగదుతో పాటు శాలువాతో సన్మానిస్తారు. తెలుగు భాషకు సంబంధించి ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, కె. శ్రీనివాస్, జేఎస్ మూర్తి (విహారి) జ్యూరీలుగా వ్యవహరించారు. తెలుగు నుంచి మొత్తం 14 పుస్తకాలను జ్యూరీ సిఫారసు చేయగా.. పెనుగొండ లక్ష్మీనారాయణ రచించిన 'దీపిక' అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటి అవార్డుకు ఎంపికైంది.

# చెత్త పేరుకుపోకుండా చైనా తరహాలో విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు: నారాయణ



రాజమహేంద్రవరం, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): చెత్త పేరుకుపోకుండా చైనా తరహాలో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. మూడేళ్లలో రాజధాని అమరావతి పనులను పూర్తి చేస్తామన్నారు. పుష్కరాలు, రాజమహేంద్రవరం అభివృద్ధిపై సీఎం చంద్రబాబుతో సమీక్షిస్తామని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం పన్నులు పెంచిందని.. ప్రభుత్వ నిధులను దారి మళ్లించిందని మంత్రి నారాయణ విమర్శించారు.

# ఆటో నడుపుతూ అసెంబ్లీకి వచ్చిన కేటీఆర్

## భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆటోలో అసెంబ్లీకి వచ్చారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కొందరు ఎమ్మెల్యేలను ఎక్కించుకుని స్వయంగా తానే ఆటో నడుపుతూ అసెంబ్లీకి చేరుకున్నారు. పార్టీ నేతలంతా ఖాకీ చొక్కాలు ధరించి వచ్చారు.



హైదరాబాద్, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆటోలో అసెంబ్లీకి వచ్చారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కొందరు ఎమ్మెల్యేలను ఎక్కించుకుని స్వయంగా తానే ఆటో నడుపుతూ అసెంబ్లీకి చేరుకున్నారు. పార్టీ నేతలంతా ఖాకీ చొక్కాలు ధరించి వచ్చారు.ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "ఇచ్చినహామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా ఉండాలి. 93 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణం. ఆటో కార్మికులు ధైర్యాన్ని కోల్పోవద్దు. భారాస అండగా ఉంటుంది. న్యాయం జరిగే వరకు పోరాడుతాం" అని కేటీఆర్ అన్నారు. మరోవైపు.. శాసనసభలో ఆటో డ్రైవర్ల సమస్యలపై భారాస వాయిదా తీర్మానం ఇచ్చింది.

# ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోంది :మంత్రి శ్రీధర్ బాబు

## ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు.



హైదరాబాద్, డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): ఆటో డ్రైవర్లను భారాస మోసం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా ఆ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. శాసనసభలో ఆయన మాట్లాడారు."పదేళ్లలో భారాస చేయని అభివృద్ధి ఏడాదిలో చేయమంటే ఎలా..? ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. ఓవర్సీస్ ఉపకార వేతనాలను ఎక్కడ ఆపలేదు. భారాస సభ్యులు సభను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి" అన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పదేళ్ల భారాస హయాంలో ఆ పార్టీ నేతలు రూ. వేలకోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, దళితబంధు, ఈ-కార్ రేసుల్లో కమీషన్లు తీసుకున్నారన్నారు.అనంతరం స్పీకర్ ప్రసాద్కుమార్ స్పందిస్తూ భారాస సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వివేకానంద వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నామన్నారు. మరో ఎమ్మెల్యే పాడి కౌశిక్రెడ్డి తీరు మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సీనియర్ సభ్యులు కొత్త సభ్యులకు నేర్పించేది ఇదేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్ను పరామర్శించిన అల్లు అరవింద్

## సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ను సినీ నిర్మాత అల్లు అరవింద్ పరామర్శించారు.



హైదరాబాద్ , డిసెంబర్ 18, (రిపబ్లిక్ న్యూస్): కింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ను సినీ నిర్మాత అల్లు అరవింద్ పరామర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ క్రాస్రోడ్లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్ గత రెండు వారాలుగా కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.శ్రీతేజ్ ఆరోగ్యం విషమంగానే ఉందని కిమ్స్ వైద్యులు చేతన్, విష్ణు తేజ్లు మంగళవారం రాత్రి విడుదల చేసిన హెల్త్ బులిటెన్లో పేర్కొన్నారు. ఐసీయూలో వెంటిలేటర్పైనే ఉన్నాడన్నారు. మెదడుకు ఆక్సిజన్ సరిగా అందటం లేదని, బాలుడిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. ప్రస్తుతం ట్యూబ్ ద్వారా ఆహారం అందిస్తున్నామన్నారు.

# అలా తోడుండే భాగస్వామి కావాలి :రష్మిక


**తాజాగా ఓ ఇంటర్వ్యూలో తనకు కాబోయే భాగస్వామి గురించి రష్మిక పంచుకున్నారు. జీవితంలో ప్రతీ దశలోనూ తోడుండే భాగస్వామి కావాలన్నారు.**



ప్రస్తుతం 'పుష్ప2' విజయోత్సాహంలో ఉన్న రష్మిక తాజాగా ప్రేమ, రిలేషన్ గురించి మాట్లాడారు. తనలాంటి మనస్తత్వం ఉన్న భాగస్వామి కావాలన్నారు. తన జీవితంలోకి రాబోయే లైఫ్ పార్ట్నర్ ఎలా ఉండాలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 'నా భాగస్వామి నా జీవితంలోని ప్రతీ దశలోను తోడుండాలి. అన్నివేళలా నాకు భద్రతనివ్వాలి. జీవితంలోని కష్ట సమయంలో నాకు సపోర్ట్ చేయాలి. కచ్చితంగా ఒకరిపై ఒకరికి గౌరవం ఉండాలి. శ్రద్ధ వహించాలి. మంచి మనసు ఉండాలి. ఒకరిపై ఒకరు బాధ్యతగా ఉండే జీవితమంతా కలిసిఉండొచ్చు' అని తెలిపారు. ఇక ప్రేమ గురించి చెబుతూ.. 'జీవితంలో ప్రతిఒక్కరికీ తోడు కావాలి. నా దృష్టిలో ప్రేమలో ఉండడం అంటే భాగస్వామిని కలిగిఉండడమే. తోడు లేకపోతే జీవితానికి ప్రయోజనం ఉండదు. మన ఒడుదొడుకుల్లో మనతో ఉండి సపోర్ట్ చేసేవారు ఉండాలి' అని చెప్పారు.ఇక రష్మిక ప్రస్తుతం వరుస సినిమాలతో అలరించేందుకు బిజీగా ఉన్నారు. తాజాగా ఆమె నటించిన 'పుష్ప 2 ది రూల్ ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. విడుదలైన అన్ని ప్రాంతాల్లో మంచి కలెక్షన్లు సాధిస్తోంది. రూ.1500 కోట్లకు చేరువలో ఉంది. అలాగే రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'ది గర్ల్ ఫ్రెండ్' టీజర్ తాజాగా విడుదలైంది. విజయ్ దేవరకొండ వాయిస్ అందించిన ఆ టీజర్ అందరినీ ఆకర్షిస్తోంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో విభిన్నమైన ప్రేమ కథతో లేడీ ఓరియంటెడ్ సినిమాగా రానుంది.

## 'ది రోషన్స్'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే..?

**బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కుటుంబంపై డాక్యుమెంటరీ సిద్ధమైంది. త్వరలో ఇది స్ట్రీమింగ్కు రానుందని నెటిఫ్లెక్స్ ప్రకటించింది.**




చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం డాక్యుమెంటరీల ట్రెండ్ కొనసాగుతోంది. నయనతార జీవితాన్ని ఆధారంగా చేసుకొని రూపొందిన 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్ ఇటీవల విడుదలై విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడిదే కోవలో మరో స్టార్ హీరో కుటుంబంపై డాక్యుమెంటరీ సిద్ధమైంది. త్వరలో ఇది స్ట్రీమింగ్కు రానుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

## నన్ను నేనెప్పుడూ అంత లావుగా చూసుకోలేదు: నటి

**తన ప్రెగ్నెన్సీ జర్నీ గురించి మాట్లాడారు నటి రాధికా ఆప్టే ప్రెగ్నెంట్ అని తెలిసిన వెంటనే తాను షాకయ్యానని అన్నారు.**



'లెజెండ్'తో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు నటి రాధికా ఆప్టే ఇటీవల ఆమె తల్లి అయిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఆంగ్ల వెబ్సైట్కు రాధిక ఇంటర్వ్యూ ఇచ్చారు. తన ప్రెగ్నెన్సీ జర్నీ గురించి మాట్లాడారు. ఈ ప్రయాణంలో తాను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నానని అన్నారు."పిల్లల విషయంలో మేము ఎలాంటి ప్లాన్ చేసుకోలేదు. గర్భం దాల్చానని తెలిసిన వెంటనే కంగారుపడ్డా. డెలివరీకి కొన్ని రోజుల ముందు ఒక ఫొటోషూట్లో పాల్గొన్నా. అంత లావుగా నేను ఎప్పుడూ లేను. ఆవిధంగా నన్ను నేను చూసుకోవడానికి ఎంతో ఇబ్బందిపడ్డా. శరీరం నా అధీనంలో లేదు. సరిగ్గా నిద్ర ఉండేది కాదు. తల్లినైన తర్వాత శరీరం మళ్లీ మారింది. కొత్త సవాళ్లు, ఆవిష్కరణలతో విభిన్న దృక్పథం ఏర్పడింది. ఇప్పుడు ఆ ఫొటోలు చూసుకుంటే అప్పుడు అంత ఇబ్బందిపడకుండా డాల్సిందనిపిస్తుంది. ఈ మార్పుల్లో కూడా నాకొక అందం, ఆనందం కనిపిస్తుంది. భవిష్యత్తులో ఈ ఫొటోలు ఎప్పుడు చూసినా నాకు ఆనందమే వస్తుంది. ఏ మహిళకు అయినా ప్రెగ్నెన్సీ అనేది అంత సులభమైన విషయం కాదు. అదొక క్లిష్టతరమైన ప్రయాణం. మానసిక, శారీరక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో జీవిత భాగస్వామి, కుటుంబసభ్యుల సపోర్ట్ మహిళకు ఎంతో అవసరం. ప్రెగ్నెన్సీ సమయంలో నా భర్త బెనెడిక్ట్ అన్ని విషయాల్లో నన్ను అర్థం చేసుకొని నాకు సపోర్టా నిలిచారు. ధైర్యం చెప్పారు" అని రాధిక చెప్పారు.'రక్తచరిత్ర'తో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చారు రాధికా ఆప్టే. ఆ సినిమాతో ఆమె తెలుగు వారి ఆదరణను సొంతం చేసుకున్నారు. 2015లో విడుదలైన 'లయన్' తర్వాత టాలీవుడ్కు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత బాలీవుడ్లో వరుస చిత్రాల్లో నటించారు. ఈ ఏడాది ఆమె నటించిన 'మెర్రీ క్రిస్మస్', 'సిస్టర్ మిడ్నైట్' చిత్రాలు విడుదలయ్యాయి. ఆమె నటించిన హాలీవుడ్ మూవీ 'లాస్ట్ డేస్' నిర్మాణాంతర పనులు జరుగుతున్నాయి. 2012లో బ్రిటీష్ కంపోజర్ బెనెడిక్ట్ టేలర్ను ఆమె ప్రేమించి పెళ్లాడిన విషయం తెలిసిందే.

# మీ వెక్కిరింపులు ఇకనైనా ఆపండి

## ..:ట్రోల్స్పై నయన్ భర్త ఆగ్రహం

**సోషల్మీడియా వేదికగా తనపై వస్తోన్న ట్రోల్స్ను ఉద్దేశించి నటి నయనతార భర్త విఘ్నేశ్ శివన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి విషయం తెలుసుకోకుండా విమర్శలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు.**




'నానుమ్ రౌడీ దాన్' చిత్రాన్ని హీరో అజిత్ కుమార్ మెచ్చుకున్నారంటూ ఇటీవల నయనతార భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ఆయన అబద్ధం చెబుతున్నారంటూ ఆన్లైన్ వేదికగా పలువురు ట్రోల్స్ చేయడం మొదలుపెట్టారు. దీనిపై తాజాగా ఆయన క్లారిటీ ఇచ్చారు. నిజానిజాలు తెలుసుకోకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు."ఎన్నై అరిందాల్ (తెలుగులో ఎంతవాడు గాని) సమయం నుంచి అజిత్ నాకు తెలుసు. ఆ సినిమా కోసం దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్ పాట రాయమని అడిగితే రాసిచ్చా. ఆ సమయంలోనే అజిత్తో నాకు పరిచయం ఏర్పడింది. నేను తెరకెక్కించిన 'నానుమ్ రౌడీ దాన్' సినిమా విడుదలయ్యాక ఆయనతో మాట్లాడా. 'విశ్వాసం' షూట్లో భాగంగా ఆయన హైదరాబాద్లో ఉన్నప్పుడు అనుకోకుండా కలిశా. 'నానుమ్ రౌడీ దాన్' తాను చూశానని చాలా బాగుందని ఆయన అన్నారు. ఇది నిజం. మొన్న జరిగిన ఇంటర్వ్యూలో ఈ మొత్తం విషయాన్ని చెప్పడానికి సమయం లేకపోయింది. అగ్ర దర్శకులతో కలిసి ఇంటర్వ్యూలో ఉన్నప్పుడు.. ప్రతి విషయాన్ని పూర్తిగా వివరిస్తూ సమయాన్ని ఎక్కువగా తీసుకోవడం సరికాదు. అందువల్లే పూర్తి విషయాన్ని ఆరోజు చెప్పలేకపోయా. కాబట్టి, ఇకనైనా ఎగతాళి చేయడం, వెక్కిరించడం ఆపండి" అని ఆయన రాసుకొచ్చారు.తమిళం, తెలుగు చిత్ర పరిశ్రమలకు చెందిన దర్శకులు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 2024లో వచ్చిన పలు చిత్రాల గురించి మాట్లాడారు. అలాగే, తమ కెరీర్ను ఉద్దేశించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇందులో పాల్గొన్న విఘ్నేశ్ శివన్.. అజిత్ తో తనకు ఉన్న పరిచయం గురించి మాట్లాడారు. 'ఎన్నై అరిందాల్' కోసం తాను పాట రాశానని చెప్పారు. 'నానుమ్ రౌడీ దాన్' సినిమా చూసి అజిత్ తనని మెచ్చుకున్నారని తెలిపారు. ఇది నెట్టింట వైరల్ గా మారింది. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. "ఎన్నై అరిందాల్ ఫిబ్రవరి 2015లో విడుదలైంది. 'నానుమ్ రౌడీ దాన్' అదే ఏడాది అక్టోబర్ లో విడుదలైంది. మీ సినిమా విడుదల కాకముందే అజిత్ ఎలా చూశారు? మిమ్మల్ని ఎలా మెచ్చుకున్నారు?" అని విమర్శించారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1824 : బెంగాలీ పాత్రికేయుడు లాల్ బెహారీ దే జననం (మ.1892).
- 1878 : రష్యాకు చెందిన కమ్యూనిస్ట్ నేత, అధ్యక్షుడు స్టాలిన్ జననం (మ.1953).
- 1946 : అమెరికా కు చెందిన సుప్రసిద్ధ సినీదర్శకుడు, రచయిత, నిర్మాత స్టీవెన్ స్పీల్బెర్గ్ జననం.
- 1952: ప్రసిద్ధ స్వాతంత్ర్యోద్యమ కవి, గరిమెళ్ళ సత్యనారాయణ మరణం (జ.1893). (చిత్రంలో)
- 1961 : భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు లాల్చంద్ రాజ్పుత్ జననం.
- 1963 : అమెరికాకు చెందిన నటుడు, చలన చిత్ర నిర్మాత బ్రాడ్ పిట్ జననం.
- 2014: భూసమస్థితి శాటిలైట్ లాంచ్ వెహికల్ ఎం.కె.ప్రయోగం విజయవంతం.


లాల్ బెహారీ దే


స్టాలిన్


స్టీవెన్ స్పీల్బెర్గ్


సత్యనారాయణ


లాల్చంద్ రాజ్పుత్


బ్రాడ్ పిట్


ఎం.కె.ప్రయోగం

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# వదలని వరుణుడు

## .. గబ్బా టెస్టు మ్యాచ్ డ్రా

**2024..! బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో గబ్బా టెస్టు డ్రాగా ముగిసింది. వర్షం కారణంగా ఆట సాధ్యపడకపోవడంతో అంపైర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు.**



అనుకొన్నదే అయింది. భారత్ పోరాటానికి వరుణుడు సహకరించాడు. చివరి రెండు సెషన్లలో టీన్ఇండియాను ఆలౌట్ చేసి విజయం సాధించాలని ఆస్ట్రేలియా భావించింది. అందుకు తగినట్లుగానే వేగంగా ఆడింది. భారత్ ఎదుట 275 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టార్గెట్ను ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ 8/0 స్కోరుతో ఉన్నప్పుడు వర్షం వచ్చేసింది. ఎంతకీ తగ్గకపోవడంతో మ్యాచ్ను ముగిస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో గబ్బా వేదికగా టెస్టు మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ లో ఆసీస్ 445 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్ 260 పరుగులే చేయగలిగింది. రెండో ఇన్నింగ్స్ లో ఆసీస్ 89/7 స్కోరుతో డిక్లేర్డ్ చేసింది. ఐదు టెస్టుల సిరీస్లో చెరొక విజయంతో, సిరీస్ 1-1తో సమంగా నిలిచాయి. నాలుగో టెస్టు మ్యాచ్ మెల్బోర్న్ వేదికగా డిసెంబర్ 26 నుంచి (బాక్సింగ్ టెస్టు) ప్రారంభం కానుంది.

### అంతర్జాతీయ క్రికెట్కు రవిచంద్రన్ అశ్విన్ వీడ్కోలు

**భారత సీనియర్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు చెబుతున్నట్లు ప్రకటించాడు.**

భారత సీనియర్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియాతో మూడో టెస్టు ముగిసిన అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్లో అశ్విన్ ప్రకటన చేశాడు. అంతకుముందు డ్రెస్సింగ్ రూమ్లో



విరాట్ కోహ్లితో అశ్విన్ భావోద్వేగానికి గురైన వీడియో నెట్టింట వైరల్ గా మారింది.

## ఆరోగ్యం




ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. అయితే, అలాంటి ఆరోగ్యాన్ని చాలా మంది నిర్లక్ష్యం చేస్తారు. ప్రస్తుత జనరేషన్లో చాలా మంది లైఫ్ స్టైల్ మీద ఎక్కువగా ఫోకస్ పెట్టడం లేదు. ఉరుకుల పరుగుల జీవితంలో ఎలా పడితే అలా బతికేస్తున్నారు. టైమ్కి తినకపోవడం, ఏది పడితే అది తినడం, స్మోకింగ్, డ్రింకింగ్ ఇలా ఓ పద్ధతి లేకుండా జీవిస్తున్నారు. దీంతో.. అనారోగ్యాల బారిన పడుతున్నారు. అందులో మొత్తం ప్రపంచాన్ని భయపెడుతున్న ఒక వ్యాధి ఉంది. అదే గుండెపోటు ఈ రోజుల్లో చాలా మంది గుండె పోటుతో ఆకస్మాత్తుగా చనిపోతున్నారు. యువత కూడా గుండె పోటు బారిన పడుతున్నారు. అంతేకాకుండా గుండె సమస్యలు వస్తున్నాయి.గుండె జబ్బులకు చెక్ పెట్టాలంటే మన జీవన శైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా తినే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏది పడితే అది తినకూడదు. ముఖ్యంగా రాత్రి నిద్రపోయే ముందు చేసే డిన్నర్ విషయంలో అజాగ్రత్తగా ఉండకూడదంటున్నారు నిపుణులు. రాత్రి తినే ఆహారాలు చాలా వరకు గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. తినే ఆహారం నుంచి చేసే పనుల వరకు కొన్ని మార్పులు చేసుకుంటేనే గుండె బలంగా ఉంటుంది. లేదంటే మహమ్మారి బారిన పడక తప్పదు. రాత్రి పూట కొన్ని ఆహారాలకు జోలికి పోకూదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఫుడ్స తింటే గుండెకు ప్రమాదమంటున్నారు. ఇంతకీ ఆ ఫుడ్స్ ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.

# ఈ ఆహారాలు తింటే గుండె ధమనులు మూసుకుపోతాయి

## .. రాత్రిపూట వీటిని తినడం మానేస్తేనే మీ హార్ట్ సేఫ్..

### ఉప్పు ఎక్కువగా తినకండి..



చాలా మంది ఆహారంలో ఉప్పు ఎక్కువగా తింటారు. అయితే, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదు. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. పిజ్జా, చిప్స్, నామ్కీన్, ప్రాసెస్ చేసిన మాంసం వంటి వాటిలో ఉప్పు ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. అందుకే రాత్రి పూట భోజనంలో ఇలాంటి ఫుడ్స్ తినడం మానుకోవాలి. పప్పులు, బియ్యం లేదా రోటీ, కూరగాయలతో ఇంట్లో చేసిన వంటకాల్నే తినడం అలవాటు చేసుకోండి. కూరల్లో కూడా ఉప్పు మోతాదును తగ్గించుకోండి.

### వేయించిన ఆహారాలు..



చాలా మంది రాత్రి సమయాల్లో డీప్ ఫ్రైడ్ ఫుడ్స్ తింటుంటారు. ఫ్రైడ్ రైస్, ఫ్రైడ్ చికెన్, నూడిల్స్ వంటి వాటిని ఓ పట్టు పడుతుంటారు. వీటితో కచోరి, సమోసా, బజ్జీలు, పకోడాలు వంటివి తింటుంటారు. అయితే, వీటిలో అధిక మొత్తంలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. వీటిని తినడం వల్ల గుండె ధమనులు మూసుకుపోతాయి. దీంతో.. గుండె పోటు వచ్చే ప్రమాదం ఉంది.

### పిండి పదార్థాలు..



ఎక్కువ పిండిపదార్థాలు ఉన్న ఆహారాల్ని రాత్రి వేళల్లో తీసుకోకూడదు. బంగాళదుంపలు, పరోటాలు వంటి పదార్థాల జోలికి పోకూడదు. వీటి వల్ల కూడా చక్కెర, ఇన్సులిన్ స్పైక్లు ఏర్పడతాయి. ఎందుకంటే పిండి పదార్థాలు చక్కెరగా జీవక్రియ చేయబడి శక్తి కోసం బర్న్ అవుతాయి. దీంతో చివరికి బరువు పెరిగే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక బరువు ఉన్నవారికి గుండె పోటు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఇలాంటి ఆహారాలు రాత్రి పూట అవాయిడ్ చేస్తే చాలా మంచిది.

### స్పైసీ ఫుడ్స్ చాలా డేంజర్..



స్పైసీ ఫుడ్స్ (కారం ఎక్కువగా ఉన్న ఆహారాలు) గట్ ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదు. ఇవి ఆరోగ్యానికి హాని కలిగించడమే కాకుండా రాత్రిపూట తింటే కడుపు ఉబ్బరం, అజీర్ణం, అసిడిటీ, గుండెల్లో మంట వంటి సమస్యలను కలిగిస్తాయి. ఎందుకంటే రాత్రిపూట అలాంటి ఆహారాన్ని జీర్ణం చేయడం గట్ ఎంజైమ్లకు చాలా కష్టమైన పని. అందుకే మసాల ఆహారాలకు, స్పైసీ ఫుడ్స్కి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. రాత్రి పూట స్పైసీ ఫుడ్ తినడం గుండె ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదని ఎక్సపర్ట్స్ చెబుతున్నారు. ఇలాంటి ఫుడ్స్ గుండెపై ఒత్తిడిని పెంచుతాయి. స్పైసీ ఫుడ్స్ తినడం వల్ల రాత్రి పూట నిద్రకు కూడా భంగం కలిగే అవకాశం ఉంది.

### స్వీట్స్..



చాలా మంది రాత్రి పూట డిన్నర్ తర్వాత.. స్వీట్స్ లేదా చాక్లెట్ తింటుంటారు. అయితే, ఇది ఎంత మాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా చేయడం రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. దీంతో.. రాత్రి నిద్రిస్తున్నప్పుడు ఎటువంటి ఉపయోగం లేని అదనపు శక్తి ఉత్పత్తి అవుతుంది. దీంతో.. కొవ్వు బర్న్ కాదు. దీంతో.. బరువు పెరిగే ప్రమాదముంది. అధిక బరువు ఉన్నవారికి గుండె సమస్యల ముప్పు ఎక్కువగా ఉంటుది. అందుకే రాత్రి వేళల్లో స్వీట్స్, చాక్లెట్ వంటి పదార్థాల జోలికి పోకూడదంటున్నారు నిపుణులు. వీటి బదులు ఓ ముక్క బెల్లం తింటే మంచిదంటున్నారు నిపుణులు.

### ఈ పనులు కూడా ముఖ్యం..



మంచి ఆహారం తినడంతో పాటు కొన్ని పనుల్ని మీ దినచర్యలో భాగం చేసుకుంటేనే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కూర్చొని పనిచేసే వాళ్లే ఎక్కువగా గుండె పోటు సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారు కొన్ని చిన్నపాటి వ్యాయామాలు చేస్తే సరిపోతుంది. వాకింగ్, జాగింగ్, చిన్నపాటి నడక, సైక్లింగ్ వంటి పనులు మీ దినచర్యలో భాగం చేసుకోవాలి. బయటికి వెళ్లి వ్యాయామం చేయలేని వారికి యోగా, మెడిటేషన్ వంటి వ్యాయామాలు బాగా ఉపయోగపడతాయి.

**గమనిక..**

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.